సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం । 10 । జనవరి । 2025



సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

ఖోఖో, కబడ్డీ లాంటి సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



ఆర్డర్స్ అందేదెప్పుడు?

20 నెలల క్రితం పరీక్ష రాశారు.. ఇందులో ఉత్తీర్ణులై అర్హత సాధించారు.. పైగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయి ఐదు నెలలు గడుస్తోంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 28.1°/16.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండగా ఉంటుంది. రాత్రి వేళ చలితో పాటు మంచు పడుతుంది.

న్యూస్‌రీల్

నేడు ఉత్తర ద్వార దర్శనం

రేగొండ: నేడు (శుక్రవారం) ముక్కోటి ఏకాదశి సందర్భంగా కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ మహేష్ తెలిపారు. ఉదయం పూల సేవ అనంతరం ఉత్తర ద్వారం గుండా స్వామి వారి దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నాపాక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిట్యాల: నైన్‌పాక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య తెలిపారు. శుక్రవారం ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే నాపాక బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రమేష్‌చార్యులు అఖిల్‌చార్యులు, శ్రీనివాచార్యులు, గ్రామస్తులు నక్క భాస్కర్ పాల్గొన్నారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ



భూపాలపల్లి అర్బన్: సింగరేణి యాజమాన్యం ముద్రించిన క్యాలెండర్‌ను గురువారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, వివిధ విభాగాల అధికారులు జోతి, రవికుమార్, మారుతీ, పోషమల్లు, దయాకర్, రజినీ, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాలను తరలించాలి



భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–2 సమీపంలోని ప్రభావిత గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించి గ్రామాలను తరలించాలని భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు ఆకుదారివాడ, ఫక్కీరగడ్డ గ్రామాల భూ నిర్వాసితులు గురువారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఐదేళ్లుగా ఓసీ సమీపంలో నివసిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ భూములను కోల్పోయి ఉపాధి లేకుండా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు బుర్ర మనోజ్, అనిల్, రాజయ్య, శంకర్, సాయి, కిషోర్, రమేష్, మహేష్, రవి, సురేష్, రాజు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన నిర్వాసితుడు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా భూసేకరణ విషయంలో అధికారులు, పోలీసుల జులుంపై రాళ్లబండి రవీందర్ అనే నిర్వాసితుడు ఆన్‌లైన్‌లో హెచ్‌ఆర్‌సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రెండు రోజులుగా ఎలికేశ్వరం గ్రామంలో తమకు చెందిన 1.15 ఎకరాల భూమిపై దౌర్జన్యంగా అధికారులు గుంజుకునే విషయమై మనస్తాపం చెంది చెల్లి రజిత పెట్రోల్ పోసుకోగా, మరునాడు తల్లి కమలక్క పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడింది. ఈ విషయంలో హెచ్‌ఆర్‌సీని ఆన్‌లైన్‌లో ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.


కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత

భూపాలపల్లి అర్బన్: సింగరేణి సంస్థలో నూతనంగా కారుణ్య నియామక ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గురువారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు. సంస్థలో నూతనంగా ఉద్యోగంలో చేరుతున్న యువతీ, యువకులు అంకితభావంతో పని చేయాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు జోతి, మారుతి, రాజు, కార్మిక సంఘాల నాయకులు మధుకర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కోలుకునేదెలా..?

కౌలురైతులను గుర్తించని ప్రభుత్వాలు

- అనేక పథకాలకు దూరం
- బ్యాంకు రుణాలు పొందలేని పరిస్థితి
- ప్రతి సీజన్‌లోనూ నష్టాలపాలు
- అప్పులతోనే సాగుతున్న వ్యవసాయం



భూపాలపల్లి రూరల్: సొంతంగా భూమి లేకపోవడంతో భూమిని కౌలుకు తీసుకుని ఎన్నో ఏళ్లుగా వ్యవసాయమే జీవనాధారంగా బతుకులు వెళ్లదీస్తున్న కౌలు రైతుల పరిస్థితి జిల్లాలో దయనీయంగా మారింది. వాతావరణ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలతో కౌలు రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నా.. కౌలు రైతులపై దృష్టి సారించకపోవడంతో వీరు ఆర్థికంగా నష్టపోతూ కోలుకోలేని స్థితికి చేరాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం కౌలు రైతులు అధికారిక గుర్తింపునకు కూడా నోచుకోకపోవడం శోచనీయం. జిల్లాలో అధికారికంగా వీరికి గుర్తింపు లేకపోయినా దాదాపు 25,000 మందికి పైగానే కౌలు రైతులు ఉంటారనేది ఓ అంచనా.

గుర్తించని ప్రభుత్వం

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు కౌలు రైతులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో వారికి రుణ అర్హత కార్డులు అందజేసి, బ్యాంకు రుణాలు అందజేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌తోపాటు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం వీరిపై దయ చూపడంలేదు. దీంతో కౌలు రైతులు అప్పులపాలవుతున్నారు. కౌలు రైతులకు ఇతర రంగాల్లో ప్రావీణ్యం లేకపోవడంతో లాభనష్టాలతో సంబంధం లేకుండా కౌలు చెల్లించి వ్యవసాయాన్నే కొనసాగిస్తున్నారు.

అన్ని పథకాలకు దూరమే..

కౌలు రైతులకు అధికారిక గుర్తింపు లేకపోవడంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఏ పథకానికి వీరు అర్హత పొందలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, రైతుబీమా వంటి పథకాలకు సైతం వీరు దూరం కావాల్సిన పరిస్థితి. దీనికి తోడు బ్యాంకు రుణాలు కూడా పొందలేని పరిస్థితి. దీంతో వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకుని వ్యవసాయం చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు.

ఎకరానికి రూ.15 వేల పైమాటే..

జిల్లాలో ఎకరానికి కౌలు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతుంది. భూమిని బట్టి రైతులు కౌలును చెల్లిస్తున్నారు. జిల్లాలో నేటికీ కొన్ని ప్రాంతాల్లో వర్షాధార పంటలను సాగు చేస్తున్నారు. వర్షాధారంగా పంటలను పండించే భూములకు ఎకరాకు సంవత్సరానికి దాదాపు రూ.10వేల వరకు చెల్లిస్తుండగా.. సాగు నీరు పారే భూములకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పెట్టుబడులు రాక అప్పుల పాలవుతున్నారు.

పథకాలు వర్తింపుజేయాలి



ప్రతీ ఏడాది ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తితోపాటు పొలం సాగు చేస్తున్నాను. దిగుబడి పెట్టుబడికే సరిపోతుంది. ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకమైన కిసాన్ సమ్మాన్ యోజన పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలి. ప్రభుత్వం ఆదుకుంటే కౌలు రైతులకు ప్రయోజనం ఉంటుంది.

- అమరేందర్, కొత్తపల్లి(ఎస్‌ఎం), భూపాలపల్లి

కౌలు రైతులను గుర్తించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు కౌలు రైతులను గుర్తించాలి. కౌలు రైతులకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీచేయాలి. అతివృష్టి, అనావృష్టి సమయంలో పరిహారం అందించాలి. రైతు భరోసాను అందించాలి.

- సమ్మయ్య, రైతు స్వరాజ్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ సంధాని

చిట్యాల: రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలని ఆర్టీఓ సంధాని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సై జి.శ్రావన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టీఓ సంధాని హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. డ్రైవింగ్ చేసే ప్రతి విద్యార్థికి తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ చేసిన వారికి, ఇచ్చిన వారికి ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని అన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తిరస్కరించనున్నట్లు చెప్పారు. పది వేలు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు రోడ్డుపై జనాల మధ్యలో రాష్ డ్రైవింగ్ చేస్తే వాహనాన్ని సీజ్‌చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్సై శ్రావన్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరంలో సమావేశం

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు దేవదాయశాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా కాళేశ్వరం దేవస్థానం అభివృద్ధి పనులు, కుంభాభిషేకం, సరస్వతినది పుష్కరాలపైన సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి జిల్లాస్థాయి సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

ఆ కాంట్రాక్టర్లను తొలగించండి

- కొత్త వారితో పనులు పూర్తిచేయాలి
- పీహెచ్‌సీ ఉప కేంద్రాల భవన నిర్మాణ పనుల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి: ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాల్లో జాప్యం చేసిన కాంట్రాక్టర్లను వెంటనే తొలగించి, కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి పూర్తి చేయించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో పీహెచ్‌సీ సబ్ సెంటర్ల భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనుల్లో జాప్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. భాగిర్తిపేట, చెన్నాపూర్, రంగయ్యపల్లి, సుల్తాన్‌పూర్ పీహెచ్‌సీ ఉప కేంద్రాలు నవంబర్ 2022 సంవత్సరంలో పూర్తి చేయాల్సి ఉందని, ఎందుకు పూర్తి చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినా ప్రజావసరాల పనుల్లో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. పలిమెల, కొత్తపల్లిగోరి మండలాల్లో 108 అంబులెన్స్‌ల మంజూరుకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞాతం వీడి జన జీవనంలో కలవాలి

ఎస్పీ కిరణ్ ఖరే



సోమయ్య కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. 30ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన మావోయిస్టు నేత మచ్చ సోమయ్య కుటుంబాన్ని సందర్శించారు. ఆయన భార్య సుగుణమ్మకు దుప్పట్లు, మెడికల్ కిట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. వారితో మాట్లాడి కుటుంబ నేపథ్యం, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సోమయ్య అడవి వీడి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. లొంగిపోతే ఆయనపై ఉన్న రివార్డు, ప్రభుత్వ నుంచి అనేక ప్రయోజనాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి డీఎస్పీ ఎ.సంపత్‌రావు పాల్గొన్నారు.

వైద్యారోగ్య కార్యక్రమాలు విస్తృతం

డీఎంహెచ్‌ఓ మధుసూదన్



వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్

భూపాలపల్లి అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది ప్రభుత్వ వైద్యసేవలపై నమ్మకం కలిగే విధంగా వైద్యారోగ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్ల మధుసూదన్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని, గూగుల్ టైం పాండ్ ఫొటోలను అందరూ గ్రూపులో పెట్టాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చి రోగులకు సరైన చికిత్స అందించి నమ్మకాన్ని పెంపొందించాలని తెలిపారు. సాధారణ కాన్పులపై అవగాహన కల్పించాలన్నారు. ఐఎంఆర్, ఎంఎంఆర్ రేటును తగ్గించాలన్నారు. చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం వేయాలని ఆదేశించారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని, క్షయ వ్యాధిని నమోదు చేయడంలో వెనకబడి ఉన్నామన్నారు. ఇది పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎన్‌సీడీ, డయాబెటిక్ హైపర్టెన్షన్ కేసులను గుర్తించి వారికి క్రమం తప్పకుండా మందులు అందించాలన్నారు. పాలిటివ్ కేర్ పేషెంట్ వద్దకు వెళ్లి ఏ విధంగా సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. 104, 108 సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవి రాథోడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్‌కుమార్, డెమో శ్రీదేవి, డీపీహెచ్‌ఎన్ శౌరిల్లమ్మ, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

తుది దశకు సర్వే

- త్వరలో ఉమ్మడి జిల్లాలో పూర్తికానున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- సంక్రాంతి తర్వాత దరఖాస్తుల పరిశీలన
- అనంతరం గ్రామసభల్లో అర్హుల ఎంపిక ప్రక్రియ
- తొలి విడత భూమి ఉండి ఇళ్లు లేని వారికే అవకాశం

సాక్షి, వరంగల్: పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల యాప్ సర్వే వేగంగా జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తుదారులు ఉండకపోవడం, ఇంకొందరు ఉద్యోగం చేస్తున్న నగరాల నుంచి స్వగ్రామాలకు వెళ్లడం, కొన్ని సందర్భాల్లో గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో కొంతమంది వార్డు అధికారులు, ఇతర సిబ్బంది గైర్హాజరు కావడం, యాప్‌లో సాంకేతిక సమస్యల వంటి కారణాలతో సర్వే ఆలస్యమైంది. వారం రోజులుగా సర్వే వేగం పుంజుకుంది. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల్లో 90 శాతానికిపైగా సర్వే పూర్తి చేశారు. సంక్రాంతిలోపు మొత్తం ముగుస్తుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా వరంగల్, హనుమకొండలో దరఖాస్తుదారులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో కాస్త ఆలస్యమైంది. తమ ఇంటికి అధికారులు సర్వేకు రావడం లేదని, దరఖాస్తులు లేవని అధికారులు సమాధానం చెబుతున్నారంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

42 వేల మందికే..

ఉమ్మడి జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలున్నాయి. ఈ 12 నియోజకవర్గాలకు 42,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మొదటి విడత ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించనున్నారు. తొలి విడత సొంత స్థలం ఉన్నవారికి, రెండో విడత స్థలం లేనివారికి ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇళ్లను మంజూరు చేయనుంది. ప్రజాపాలనలో మహిళల పేరుతో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వారి పేరు మీదనే ఇళ్లు ఎంపిక చేసేలా అధికారులు కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. గతంలో మాదిరిగానే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలలో అక్రమాలు జరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారానే సమగ్ర వివరాలు పొందుపరిచే ప్రక్రియ పూర్తి కావొచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది లక్షలకు పైగా దరఖాస్తులు వస్తే తొలుత భూమి ఉండి ఇళ్లు లేని వారికి ఇవ్వనున్నారు. వీరు దాదాపు నాలుగు లక్షలకుపైనే ఉండడంతో తొలి విడత 42,000 మందికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.ఐదు లక్షల చొప్పున ఆర్థిక సాయం అందనుంది. ఇదిలా ఉండగా సంక్రాంతి లోపు సర్వే పూర్తి కానుండడంతో యాప్‌లో వివరాలు వాస్తవంగా నమోదు చేశారా, ఏమైనా అవకతవకలకు పాల్పడ్డారా అని తెలుసుకునేందుకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ క్షేత్రస్థాయిలో సూపర్ చెక్ చేసేందుకు గ్రామాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల లాగిన్‌లకు పంపుతోంది. వీరు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వేయర్లు యాప్‌లో నమోదు చేసిన వివరాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలిస్తారు. ఏమైనా తప్పని తేలితే బాధ్యుడైన సర్వేయర్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. ఆ తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఆధ్వర్యంలో అర్హులను ఎంపిక చేయనున్నారు.



నల్లబెల్లి : రేలకుంటలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహామూర్తి (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, సర్వే పూర్తయిన వివరాలు..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు	సర్వే పూర్తయినవి	శాతం
భూపాలపల్లి	1,23,469	1,16,217	94
ములుగు	90,863	87,315	96
వరంగల్	2,33,636	2,21,316	95.01
జనగామ	1,43,187	1,34, 696	94
మహబూబాబాద్	2,17,591	1,95,500	90
హనుమకొండ	1,96,703	1,82,228	92.64
	10,05,449	9,37,272	

ఉద్యోగం నుంచి పీఈటీ తొలగింపు

కాటారం: మహాముత్తారం మండలంలోని దొబ్బలపాడు ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించి, దూషించిన (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి) వ్యాయామ ఉపాధ్యాయుడు మంతెన భాను ప్రకాశ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల అదనపు డైరెక్టర్ శ్రీనివాసచారి ఆదేశాలు జారీచేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రవి గురువారం తెలిపారు. గతనెల 28న పీఈటీ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులను సీఎం కప్ క్రీడా పోటీల కోసం హైదరాబాద్ తీసుకెళ్లాడు. ఇదే క్రమంలో మద్యం సేవించి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దూషించాడు. దీంతో ఇంటికి తిరిగి వచ్చిన సదరు విద్యార్థినులు తల్లిదండ్రులకు విషయం వివరించి మోడల్ పాఠశాల అడిషనల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండల అధికారులతో విచారణ జరిపించిన ఏడీ వారి నివేదిక ప్రకారం పీఈటీని ఉద్యోగం నుంచి తొలిగించారు.



ముందస్తు వేడుకలు

కాటారం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరిదాసులు, బసవన్నల వేషధారణలో విద్యార్థినులు అలరించారు. రంగవల్లులు, బొమ్మల కొలువు, భోగిమంటలు, భోగిపళ్లు, గాలిపటాలు ఎగురవేయడం, పిండి దంచడం, పిండి తిరగలిలో విసరడం, సకినాలు పోయడంతో పాటు సంక్రాంతి పండుగ విశిష్టత తెలిపే పాటలపై నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్ల సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- కాటారం**

వరంగల్ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

వరంగల్ : సంక్రాంతి సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్ వరుసగా ఐదు రోజులు సెలవు ఉందని, ఈ సమయం యార్డుల్లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 11న (శనివారం)వారాంతపు యార్డు బంద్, 12న(ఆదివారం)వారాంతపు సెలవు, 13న(సోమవారం)భోగి, 14న(మంగళవారం) సంక్రాంతి, 15న (బుధవారం) కనుమ పండుగ ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమాస్తా, దడవాయి, కార్మికులు గమనించాలన్నారు. 16వ తేదీన (గురువారం) మార్కెట్ పునఃప్రారంభమవుతుందని పి.నిర్మల పేర్కొన్నారు.

కేయూ తెలుగు విభాగాధిపతి జ్యోతి కన్నుమూత



ఏటూరు జ్యోతి (ఫైల్)

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి (55) గురువారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. తీవ్ర అస్వస్థతకు గురై హనుమకొండలోని లోటస్‌కాలనీలో స్వగృహంలోనే గురువారం రాత్రి చనిపోయారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జ్యోతి మృతదేహాన్ని అకుట్ జనరల్ సెక్రటరీ ఆచార్య మామిడాల ఇస్తారి, పలువురు అధ్యాపకులు సందర్శించి నివాళులర్పించారు. 2007లో కేయూ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయిన జ్యోతి 2022లో ప్రొఫెసర్ అయ్యారు.



LITTLE STARS SCHOOL (E/M)
Vill: PEECHARA, Mdl: Velair, Dist: Hanumakonda
WANTED TEACHERS
Wanted Trained PRE-PRIMARY And PRIMARY (All Subjects)Teachers Educated in English Medium.
GARDENER to look after garden, Show plants, Vegetables etc.
Send Handwritten Resume to
Mob. 9833277626 (W App) (Please Don't Call)

SAN MARIA HIGH SCHOOL
Senior Secondary School, Affiliated to CBSE - 3630311
6-2-7/1-1C, HYDERABAD ROAD, JANGAON, TS -506 167
WANTED TEACHERS
Applications are invited from Qualified and Experienced (3 Years) Teachers to Teach the following Subjects in CBSE School
PRE-PRIMARY : Mother Teacher
PRIMARY : All Subjects
MIDDLE SCHOOL : Hindi, English, Science, Social, IIT Maths, Physics, Chemistry
SENIOR SECONDARY SCHOOL : Physics, Chemistry, Commerce, IIT Maths, Physics, Chemistry
P.E.T
Interested and eligible Candidates are invited to submit their applications along with Xerox copy of Certificates on or before 25-01-25. Demos and Interviews will be conducted on 31-01-25.
Cell: 7660990000, 7680813275 Sd/- Principal

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

అమ్మకానికి కలదు

■ Restaurant / హోటల్ అమ్మకానికి కలదు. కిట్స్ కాలేజి ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట. సంప్రదించవలసిన ఫోన్ నెం: 9281474365. [W-1264116]

SERVICES

LOSS OF CERTIFICATES

■ I, ARUN MUNAGALA, S/o. SRIRAM MUNAGALA, aged 21 yrs, Occ: Student, R/o. ISH Hostel in Room No. D408, NIT, Warangal Campus, Kazipet Mandal, Hanumakonda Dist, Telangana State, have lost the original B.Tech (ECE) First Semester, Second Semester & Third Semester Certificate, which was issued to me by the NIT Warangal College & has been lost while walking from NIT Hostel Room to NIT Main Gate (Campus surrounding) of Hanumakonda Dist on 25-09-2024. If found, please inform me at the above address & Cont: 9686045732. [W-1264067]

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264166]

BUSINESS SERVICES

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-297]

■ మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. సెల్: 9177555694. [SCA25001126]

WANTED

■ ప్రముఖ భద్రకాళి ఫర్నీచర్, శివనగర్ నందు పని చేయుటకు యువతీ యువకులు వెంటనే కావలెను. రూం సౌకర్యం కలదు. సంప్ర: 9246992479. [WA-14758]

■ మా అపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్ స్త్రీ/పురుషులు అర్జెంటుగా కావలెను. సంప్ర: 9491710857, 7382106287. [W-1264184]

■ మా ఆఫీసులో పని చేయుటకు అర్జెంటుగా స్త్రీలు కావలెను. Cont: 7382323126. [W-1264185]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు॥ కావలెను. జీతం: 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95027 12418. [M-1256030]

■ హైదరాబాద్‌లో లేడీస్ హాస్టల్‌లో పని చేయుటకు ఫిమేల్ కుక్ / కేర్ టేకర్ కావలెను. నెలకు రూ. 20 వేలు జీతం, భోజనం, వసతి సౌకర్యం కల్పించబడును. సంప్రదించండి సెల్॥ 70937 05845. [K-1202414]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్డర్స్ అందేదెప్పుడు ?

5 నెలలుగా జేఏ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ అభ్యర్థుల ఎదురుచూపులు
- నియామక పత్రాల కోసం నిరీక్షణ
- నూతన సంవత్సర కానుకగా అందిస్తారని ఆశించినా నిరాశే
- జాప్యానికి గల కారణాలు తెలపని టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం



హన్మకొండ : 20 నెలల క్రితం పరీక్ష రాశారు.. ఇందులో ఉత్తీర్ణులై అర్హత సాధించారు.. పైగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయి ఐదు నెలలు గడుస్తోంది. అయినా నియామకపత్రాలు అందించడం లేదు. ఫలితంగా తాము ఏమీ పాపం చేశామని, ఇంకెంత కాలం ఎదురుచూడాలని పలువురు జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు వాపోతున్నారు. ఇతర ఉద్యో నియామకాలు, డీఎస్సీ ప్రక్రియను 65 రోజుల్లో పూర్తి చేసిన ప్రభుత్వం.. టీజీ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల నియామకాల్లో ఎందుకు జాప్యం చేస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల నోటిఫికేషన్ తర్వాత ఏడు నెలలకు జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 6న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించింది. అంతకు ముందే నోటిఫికేషన్ జారీ చేసి.. రాత పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసినా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించకపోవడంలో ఆంతర్యమేమిటని ఉద్యోగ సంఘాలు, కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఆలస్యమవుతున్న క్రమంలో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఏమైనా అక్రమాలకు పాల్పడుతున్నారా? లేక ఏమైనా అవకతవకలు జరిగాయా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ నియామకాలపై టీజీ ఎన్పీడీసీఎల్ నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ప్రక్రియలో ఏదో లోపం జరిగిందనే భావన వ్యక్తమవుతోంది.

అభ్యర్థుల ఆశలపై నీళ్లు..

నూతన సంవత్సర కానుకగా డిసెంబర్ చివరలో తమకు నియామక పత్రాలు అందజేస్తారని అభ్యర్థులు ఆశించారు. అయితే వారి ఆశలపై ఎన్పీడీసీఎల్ యాజమాన్యం నీళ్లు చల్లింది. నియామకపత్రాలు అందించ లేదు. జాప్యం జరుగుతుండడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతూ హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు రేపు, మాపు అంటూ కచ్చిత సమాచారం ఇవ్వకుండా మరింత క్షోభకు గురి చేస్తున్నారని పలువురు అభ్యర్థులు మండిపడుతున్నారు.

రాత పరీక్షతోపాటు ఫలితాల వెల్లడిలోనూ జాప్యం..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్టుల భర్తీకి యాజమాన్యం 2023 మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 2023 మే 28న జరగాల్సిన రాత పరీక్ష వివిధ కారణాలతో వాయిదా వేశారు. తిరిగి 2023 జూన్ 4న హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించారు. ఫలితాల వెల్లడిలో కూడా తీవ్ర జాప్యం జరిగింది. 2024 ఆగస్టు 1న ఫలితాలు విడుదల చేసి అదే నెల 22వ తేదీన సర్టిఫికెట్లు పరిశీలన జరిపినా ఇప్పటి వరకూ యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయడం లేదు.

ఆందోళనలో అభ్యర్థులు..

జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ నోటిఫికేషన్ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. తర్వాత కొద్ది రోజులకు ఎన్నికలు రావడంతో పాటు రాష్ట్రంలో మార్పు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియను 65 రోజుల్లో పూర్తి చేసింది. అయితే ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు రాత పరీక్ష జరిగి ఏడాది మీద 8 నెలలు (20 నెలలు) గడుస్తున్నా నేటికీ నియామక ఉత్తర్వులు అందించడంలో యాజమాన్యం వైఫల్యం చెందుతోందని అభ్యర్థులు విమర్శిస్తున్నారు. రాత పరీక్ష జరిగిన 15 నెలలకు ఫలితాలు విడుదల చేసి అర్హుల జాబితా విడుదల చేసిన యాజమాన్యం.. సర్టిఫికెట్ల పరిశీలన జరిపి 5 నెలలు గడుస్తున్న నేటికీ నియామక పత్రాలు అందించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే నియామక పత్రాలు అందించాలని , లేని ఎడల జాప్యానికి కారణాలు తెలపాలని ఉద్యోగ సంఘాలు, అభ్యర్థులు కోరుతున్నారు.

త్వరలో నియామక పత్రాలు



టీజీ ఎన్పీడీసీఎల్ చేపట్టిన నియామకాల్లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు అందిస్తాం. డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా నియామక పత్రాలు అందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందిస్తాం. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

-కర్నాటి వరుణ్ రెడ్డి, సీఎండీ టీజీ ఎన్పీడీసీఎల్

నేటి నుంచి సెపక్‌తక్రా చాంపియన్ షిప్

- పోటీల్లో పాల్గొననున్న 28 రాష్ట్రాల జట్లు



హన్మకొండ: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 10 (శుక్రవారం) నుంచి 14వ తేదీ వరకు పురుషులు, మహిళల సెపక్‌తక్రా (లెగ్ వాలీబాల్) చాంపియన్ షిప్ 2024–2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సెపక్‌తక్రా అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి సురేశ్ కుమార్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 28 రాష్ట్ర జట్లతో పాటు సహస్త్ర సీమాబాల్, ఆల్ ఇండియా పోలీసు జట్టు ఈ పోటీల్లో పాల్గొంటాయని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు ఈవెంట్లలో పోటీలు జరుగుతాయన్నారు. టీం ఈవెంట్, రేగూ ఈవెంట్, డబుల్ ఈవెంట్, క్వాడ్ ఈవెంట్‌లలో పోటీలు జరుగుతాయని వివరించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జేఎన్ఎస్‌లో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ యోగేందర్ సింగ్ దహియా, ప్రెసిడెంట్ ఎస్.ఆర్.ప్రేమ్‌రాజ్, సెక్రటరీ వీరగౌడ ఈ పోటీలు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి వికేశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరిడే శ్రీకాంత్, ప్రతినిధులు రిక్కల వెంకటరామకృష్ణ, కొత్తూరు కపిల్ ఆనంద్ పాల్గొంటారని వివరించారు.

రెండు గ్రూప్‌లుగా సెపక్‌తక్రా జట్లు..

జాతీయ స్థాయి సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఈ వివరాలను కానుగంటి సురేశ్ కుమార్ తెలిపారు. మహిళల విభాగంలో గ్రూప్ 'ఏ'లో ఎస్ఎస్‌బీ, అస్సాం, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, గ్రూప్ 'బీ'లో మణిపూర్, నాగాలాండ్, హరియాణ, తెలంగాణ జట్లు పోటీ పడతాయి. ఈ నెల 11న ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. పురుషుల విభాగంలో గ్రూప్ 'ఏ'లో ఎస్ఎస్‌బీ, అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, గ్రూప్ 'బీ'లో ఢిల్లీ, మణిపూర్, గోవా, ఉత్తర్ ప్రదేశ్, తెలంగాణ జట్లు ఉన్నాయి. 11న ఫైనల్ మ్యాచ్ ఉంటుంది.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి



బాలకిశోర్‌రెడ్డి భార్య స్వప్నను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు



పోటీలో తలపడుతున్న మహిళా జట్లు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- గీసుకొండలో ప్రారంభమైన అంతర్ జిల్లాల సీనియర్స్ ఖోఖో పోటీలు

గీసుకొండ: ఖోఖో, కబడ్డీ లాంటి సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లాలోని గీసుకొండ జెడ్పీ హైస్కూల్ మైదానంలో 57వ ఖోఖో సీనియర్ అంతర్ జిల్లాల పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్‌కు రావాల్సిన రూ. 79 లక్షల బకాయిల విషయంపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతానన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు రూ. 5 లక్షల సాయం అందించిన అల్లం బాలకిశోర్‌రెడ్డి, స్వప్న దంపతులను ఈ సందర్భంగా అభినందించారు. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అవసరమై స్థలం ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. గీసుకొండ పాఠశాలలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడానికి 'కుడా' నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఖోఖో పోటీల నిర్వహణకు సింథటిక్ మ్యాట్ మంజూరు చేయిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ వీరగోని రాజ్ కుమార్ పోటీల నిర్వహణకు సాయం చేసిన కిశోర్‌రెడ్డితో పాటు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ జ్ఞానేశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేతి కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పొడాల రామయ్య, తహసీల్దార్ రియాజొద్దీన్, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, అల్లం స్వప్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట రాంబాబు, మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు ఎందుకు రాలేదో!

టోర్నమెంట్ ప్రారంభానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి సీతక్క హాజరవుతారని ప్రచారం జరిగింది. వారికి స్వాగతం పలుకుతూ కాంగ్రెస్ శ్రేణులు గీసుకొండలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మంత్రులు హాజరుకాలేదు. దీనిపై రాజకీయ కోణం ఉందని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది.

కేడీసీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

- 39శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న కేయూ పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, తదితరులు

విద్యారణ్యపురి : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మొదటి సంవత్సరం మొదటిసెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి, కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి గురువారం విడుదల చేశారు. అన్ని కోర్సులు కలిపి 1,114మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 434 మంది ఉత్తీర్ణత (39శాతం) సాధించారని ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు. బాలురు 820 మంది పరీక్షలు రాయగా 283 మంది ఉత్తీర్ణత (34.51శాతం)సాధించారు. బాలికలు 294మంది పరీక్షలు రాయగా 151 మంది ఉత్తీర్ణత (51.36శాతం) సాధించారు. కార్యక్రమంలో కేడీసీ పరీక్షల నియంత్రణాధికారి శివనాగశ్రీను, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కొమురయ్య, త్యాగయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ రజినీలత, అధ్యాపకులు ఇందిరాదేవి, శ్యామ్‌ప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైలు శిక్ష అనుభవిస్తున్న దంపతుల ఇల్లు దగ్ధం

- సీతంపేటలో ఘటన
- గుర్తుతెలియని వ్యక్తుల పనిగా అనుమానం



కాలిబూడిదైన సామగ్రి

గార్ల: జైలు శిక్ష అనుభవిస్తున్న దంపతుల ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన గార్ల మండలం సీతంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గంధసిరి కృష్ణ, మంజుల దంపతులు ఓ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తుండగా గురువారం గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. 3 నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన గుమ్మడి మహేశ్ హత్య కేసులో కృష్ణ దంపతులు ప్రధాన నిందితులుగా రుజువుకావడంతో ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. ఫైరింజన్ వచ్చి మంటలార్పింది. అప్పటికే ఇంట్లోని దుస్తులు, వంటసామగ్రి కాలిబూడిదయ్యాయి. ఘటనా స్థలిని పోలీసులు సందర్శించారు.

అటవీశాఖ ఉద్యోగి ఇంట్లో దుప్పి మాంసం పట్టివేత

కాటారం : కంచె చేను మేసింది అనే చందంగా మారింది అటవీ శాఖ పరిస్థితి. ఆ శాఖలో పనిచేస్తున్న ఓ వాచర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన దుప్పి మాంసాన్ని సంబంధిత అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. అటవీ శాఖలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం ఆంజనేయులపల్లి గ్రామ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యం అక్రమంగా దుప్పి మాంసం నిల్వ చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న పెగడపల్లి రేంజ్ అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలిసి దాడి చేసి 5 కిలోల దుప్పి మాంసం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సత్యంపై వన్య ప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. ఈ దాడిలో డిప్యూటీ రేంజర్ లాయక్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి క్రెడాయ్ ప్రాపర్టీ షో

- క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రేమ్‌సాగర్ రెడ్డి, వరంగల్ అధ్యక్షుడు ఈ.తిరుపతి రెడ్డి



మాట్లాడుతున్న జి.ప్రేమ్‌సాగర్ రెడ్డి, ఈ.తిరుపతి రెడ్డి

నయీంనగర్ : క్రెడాయ్ వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీల్లో హనుమకొండలోని పీజీఆర్ గార్డెన్‌లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని, గ్రేటర్ వరంగల్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రేమ్‌సాగర్ రెడ్డి, వరంగల్ అధ్యక్షుడు ఈ.తిరుపతి రెడ్డి, తెలిపారు. ఈ మేరకు గురువారం కేయూ క్రాస్‌లోని క్రెడాయ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇల్లు, విల్లా, అపార్ట్‌మెంట్ కొనుగోలు చేయాలనుకునే వారు, స్వయంగా ఇల్లు నిర్మించుకునే వారికి సౌకర్యంగా ఉండేందుకు నగరంలో నిర్మాణమవుతున్న అన్ని అపార్ట్‌మెంట్లు, విల్లాలు, లే అవుట్‌ల సమాచారంతో పాటు ఇంటి నిర్మాణానికి కావాల్సిన ప్రాడక్ట్స్ సమాచారం ఒకే వేదికపై ఉంటుందన్నారు. లోన్ సౌకర్యం కోసం వివిధ బ్యాంకులు ఈ ప్రాపర్టీ షోలో ఒకే వేదికపై ఉంటాయన్నారు. రాష్ట్ర రెండో రాజధానిగా హైదరాబాద్ తరువాత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో కస్టమర్ సొంత ఇంటి కల నమ్మకమైన బిల్డర్‌ల ద్వారా రెరా అప్రూవ్డ్ స్థిరాస్తులను ప్రాపర్టీ షోలో చూడొచ్చని తెలిపారు. బిల్డర్లు నిర్మించే అపార్ట్‌మెంట్లు ఒకే చోట స్టాళ్లు ఏర్పాటు చేసి డిస్‌ప్లే చేస్తామని, అన్ని స్టాళ్లు తిరిగి బ్రోచర్లు తీసుకుని కుటుంబ సభ్యులు అందరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవచ్చన్నారు. ఇక్కడ బిల్డర్లు డిస్కౌంట్ కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రాపర్టీ షోలో కస్టమర్ కొనుగోలు చేసే స్థిరాస్తులకు వరంగల్ క్రెడాయ్ పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. కస్టమర్ కొనుగోలు శక్తి అనుగుణంగా రూ. 40 లక్షల నుంచి రూ. 3కోట్ల వరకు అందుబాటు ధరల్లో ప్రాపర్టీ షోలో ఉన్నాయన్నారు. క్రెడాయ్ తన వంతు సాయంగా సమాజానికి సేవ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాలు, పాఠశాలలో టాయిలెట్లు, వాటర్ ప్లాంట్లు, పబ్లిక్ టాయిలెట్లు, వరదల సమయంలో గ్రామాలను దత్తత తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ క్రెడాయ్ కార్యదర్శి జె.మనోహర్, ఉపాధ్యక్షులు ఎన్.అమరేందర్‌రెడ్డి, ఎస్.అమరలింగేశ్వర్ రావు, ఎం.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్రవాహన దొంగల అరెస్ట్

- ఆరు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి




నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆరు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు.గురువారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమకొండలోని మచిలీబజార్, పరకాల మండల వెంకటాపూర్‌కు చెందిన ముసుకుల అఖిల్, ముసుగుల అభిరామ్, ముస్కల సిద్దార్థ, ముసకుల మధుసూదన్.. సుబేదారి, కేయూ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో ఇళ్లలో ఉన్న ద్విచక్రవాహనాలను అపహరించి విక్రయిస్తున్నారు. ఆ డబ్బుతో జల్సా చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఆదాలత్ సెంటర్ వద్ద సుబేదారి ఎస్సై గాలిబ్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ నలుగురు అనుమానాస్పదంగా వెళ్తున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితుల నుంచి ఆరు బైక్‌లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సైలు రామారావు, ఫణి, గాలిబ్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులు..

- వివరాలు వెల్లడించిన సీఐ మల్లేశ్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మొగుళ్లపల్లి: ఆస్తి కోసం భర్తపై హత్యాయత్నం చేసిన భార్యతోపాటు తన కుమారులను గురువారం అరెస్ట్ చేసినట్లు చిట్యాల సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని బంగ్లాపల్లె గ్రామానికి చెందిన శాపారపు శ్రీనివాస్, కల్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు భరత్, హర్షిత్, బన్నీ ఉన్నారు. వీరికి ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే మనస్పర్ధల కారణంగా శ్రీనివాస్ తన తల్లిదండ్రుల వద్ద.. కల్యాణి తన కుమారులతో కలిసి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రీనివాస్ పేరుమీద ఉన్న ఆరు ఎకరాల భూమిని తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని భార్యతో పాటు కుమారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అప్పులు తీరాకే ఆస్తుల పంపకం చేస్తానని శ్రీనివాస్ చెప్పాడు. దీంతో ఎలాగైనా అతడిని చంపి ఆస్తి దక్కించుకోవాలనే దురుద్దేశంతో పథకం ప్రకారం బుధవారం శ్రీనివాస్‌పై కత్తితో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రరక్తస్రావం కావడంతో బాధితుడు కేకలు వేయగా చుట్టుపక్కల వారు గమనించి రక్షించే ప్రయత్నం చేయగా నిందితులు పరారయ్యారు. అనంతరం శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో హత్యాయత్నం చేసిన భార్య, కుమారులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లు 28.49 లక్షల క్వింటాళ్లు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 28.49లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు తెలిపారు. ప్రస్తుత పత్తి సీజన్ 2024–25లో ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 345.93 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిందన్నారు. నాణ్యతగల పత్తి మొత్తం కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. తమ ఉత్పత్తులు విక్రయించడంలో ఏ రైతుకైనా ఎలాంటి సమస్య తలెత్తినా +91 77189 55728 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.